సాక్షి వరంగల్

గురువారం | 23 | నవంబర్ | 2023



కాకతీయుల చరిత్ర తెలుసుకోవాలి

విద్యార్థులు కాకతీయుల చరిత్ర తెలుసుకోవాలని పురావస్తు శాఖ అధికారి మల్లేశం కోరారు. - 10లో▸



కేజీబీవీలో స్వయం పాలన

చెన్నారావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. - 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం $30^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

గంగదేవిపల్లిని సందర్శించిన బాపట్ల వాసులు



గీసుకొండ: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాపట్ల జిల్లా వాసులు బుధవారం సందర్శించారు. బాపట్ల, కొండబొట్లవారిపాలెం మండలాల పరిధిలోని కొత్త కంకటపాలెం, వేదల్లపల్లి గ్రామాల అభివృద్ధి కమిటీ (వీడీసీ) సభ్యులు 24 మంది గ్రామ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బి.యోహాస్, ప్రాజెక్టు ఆఫీసర్లు వి.బసవయ్య, ఎస్.నాగమల్లేశ్వరి, ఆర్ఎంపీ సుబ్బారావు పాల్గొన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కూసం రాజమౌళి, బాల వికాస సంస్థ ప్రతినిధి కొట్టె రమాదేవి గ్రామ అభివృద్ధిని వారికి వివరించారు.

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటు

నర్సంపేట: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నర్సంపేట ఆర్వో ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం ఎసెన్షియల్ పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి కె.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎసెన్షియల్ ఓటర్లు 19 మంది ఉండగా 17 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు.

ఆర్వో కార్యాలయాన్ని సందర్శించిన పరిశీలకుడు



నర్సంపేట: నియోజకవర్గ ఆర్వో కార్యాలయాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకుడు అమిత్ ప్రతాప్‌సింగ్ బుధవారం సందర్శించారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీల అభ్యర్థుల వ్యయ నమోదు వివరాలు, షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్ వివరాలు తేడా ఉన్నాయని, ఆ ఖర్చుల వ్యత్యాసాన్ని నోటీసులు జారీ చేసి వివరాలను 48 గంటల్లో తెప్పించుకోవాలని సహాయ వ్యయ పరిశీలకుడు శ్రీనివాస్‌కు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల వ్యయ నోడల్ అధికారి సంజీవరెడ్డి, నర్సంపేట ఏఆర్వో విశ్వప్రసాద్, నియోజకవర్గ వ్యయ నోడల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పింగిళి కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్)లో 2023–2024 విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీ గేట్ ద్వారా అర్హత సాధించిన విద్యార్థులకు ఇప్పటికే ప్రవేశాలు జరగాయని పేర్కొన్నారు. అయితే వివిధ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లలో ఈనెల 24న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను సీపీ గేట్ కన్వీనర్ అనుమతితో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీ గేట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. అర్హత సాధించని వారు డిగ్రీ సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు కలిగి ఉండి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, హిస్టరీ, ఎంకాం, ఎమ్మెస్సీ బాటనీ, జువాలజీ, మైక్రోబయాలజీలో అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 24న నేరుగా కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు హాజరై అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

నిబద్ధతతో బ్యాలెట్ వెరిఫికేషన్ చేపట్టాలి

వరంగల్ అర్బన్: ముద్రించిన పోస్టల్ బ్యాలెట్లను నిబద్ధతతో పరిశీలించాలని వరంగల్ (తూర్పు) రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన పోస్టల్ బ్యాలెట్ వెరిఫికేషన్ ప్రక్రియను ఆర్ఓ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒరిజినల్ బ్యాలెట్ పేపర్ల వెరిఫికేషన్ పూర్తి చేసినట్లు, ముద్రణలో తప్పులుంటే వెంటనే సమాచారం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు రిటర్నింగ్ అధికారి అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, పర్యవేక్షకులు ఆనంద్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంపై ఈ‘సీ’!

ఆరు రోజుల్లో ముగియనున్న ప్రచారం

- అభ్యర్థుల ప్రచారసరళిపై నిఘా..
- ఖర్చుల అంచనాల్లో అధికారులు
- ఎన్నికల నియమావళి అమలుపై సీరియస్
- ఉమ్మడి జిల్లా సరిహద్దుల్లో మరిన్ని చెక్‌పోస్టులు
- జిల్లాల సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు

సాక్షిప్రతినిధి, వరంగల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మరో ఎనిమిది రోజులే మిగిలింది. ఆరు రోజుల్లో అభ్యర్థుల ప్రచారానికి తెరపడనుంది. ఈనేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, కోడ్ అమలుపై అధికారులు మరింత నిఘా పెంచారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వీటిని పక్కాగా అమలు చేసేందుకు నిర్దేశిత బృందాల పని తీరును జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల పరిశీలకులు పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు అక్రమ నగదు, మద్యం పంపిణీకి అడ్డుకట్ట వేసేలా.. పోలీసులు చర్యలు చేపట్టారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలను మరింత పటిష్టం చేశారు. 24 గంటలు చెక్‌పోస్టుల్లో అందుబాటులో ఉంటూ.. వాహనాలను, అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఎలాంటి ఆధారాలు లేని డబ్బును స్వాధీనం చేసుకుని ఐటీ అధికారులకు అప్పగిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రూ.65 కోట్లకుపైగా నగదు, ఆభరణాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

సరిహద్దుల్లో మరింత కట్టుదిట్టం

ఉమ్మడి వరంగల్ చుట్టూ ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో మరింత కట్టుదిట్టంగా చెక్‌పోస్టులు పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల ఎన్నికలు ముగియగా.. ఆరాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి డబ్బు, మద్యం సరఫరా కాకుండా తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో భాగంగా అక్రమాల కట్టడికి చర్యలు మొదలయ్యాయి. ఓటర్లను ప్రలోభపెట్టి.. ఎన్నికలను ప్రభావితం చేసే ప్రయత్నాలకు పోలీసుశాఖ ఆచెక్‌పోస్టుల ద్వారా అడ్డుకట్ట వేస్తోంది. మద్యం, డబ్బు, గంజాయి, తదితర మాదక ద్రవ్యాలు, తాయిలాలుగా అందించే వస్తువులు రాకుండా ప్రతీ వాహనాన్ని చెక్ చేస్తున్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు కలిగిన చోట ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో ఇతరశాఖల అధికారులూ ఉంటారు. ములుగు, జేఎస్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు వేరుగా ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు.



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రచార ఆర్భాటాలపై నిరంతర నిఘా

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు ఎంసీసీ బృందాలు విస్తృతంగా తిరుగుతున్నాయి. మండల స్థాయిలో ఎంపీడీఓలు, గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో కమిషనర్లు ఎంసీసీల అమలు తీరును పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల ప్రచార సమయంతో పాటు కోడ్ ఉల్లంఘన, నియమావళి అమలు కాకపోవడం వంటి వాటిపై వచ్చే ఫిర్యాదులపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. సీ–విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై స్పందించి చర్యలు తీసుకుంటున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్‌జీఎంఎస్ (నేషనల్ గ్రీవెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం)కు రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరిస్తున్నాయి. ఎన్నికల్లో వ్యయ నియంత్రణ అనేది లేకుండాపోతున్న నేపథ్యంలో కట్టడికి ఎన్నికల సంఘం మొదటిసారి నియోజకవర్గానికి ఒక అకౌంటింగ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈబృందాలు అభ్యర్థులకు దడ పుట్టిస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో మకాం వేసి నియమావళి అమలు తీరును స్టాటిస్టిక్ సర్వేలెన్స్ బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. వీడియో సర్వేలెన్స్ బృందాలు సభల్లో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, అభ్యర్థుల ప్రసంగాలను వీడియోలో చిత్రీకరిస్తున్నాయి. వీడియో వ్యూయింగ్ బృందాలు స్టాటిస్టిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్ బృందాలతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లోని వీడియోగ్రాఫర్స్ చిత్రీకరించిన వాటిని చూసి నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన వాటిని గుర్తించి ఎన్నికల అధికారులకు నివేదిస్తున్నాయి.

అంతర జిల్లాల సరిహద్దుల్లోనూ..

అంతర జిల్లాల సరిహద్దుల్లోనూ కట్టుదిట్టమైన నిఘా ఉండేలా పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలకు సరిహద్దులుగా ఉండే భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్, ఎల్కతుర్తి మండలం పెంచికలపేట శివార్లలో రెండేసి చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎల్కతుర్తి సమీపంలోని అన్నాసాగర్ క్రాస్ వద్ద కూడా మరో చెక్‌పోస్ట్ ఉంది. ఖమ్మం, భువనగిరి జిల్లాల వైపు ఒక్కో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అలాగే.. వరంగల్, మహబూబాబాద్, ములుగు, జేఎస్ భూపాలపల్లి, జనగామ జిల్లాల సరిహద్దులతో పాటు నగరాల్లో కలిపి మొత్తం 24 డైనమిక్ చెక్‌పోస్టులు పని చేస్తున్నాయి. వీటిలో పూర్తిస్థాయిలో పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

జంగ్ తెలంగాణ

సమస్యను పక్కదారి పట్టించారా!?

బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేయని పోలీసులు

- సీడబ్ల్యూసీకి అందించని సమాచారం.. పరిశీలించని ధ్రువపత్రాలు
- ఐసీడీఎస్ పరిశీలనలో మైనర్ అని తేలినా చర్యలు శూన్యం
- రంగంలోకి ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ బృందాలు
- పూర్తిస్థాయి విచారణలో తేలనున్న నిజం

సాక్షి, వరంగల్: చెన్నారావుపేట మండలంలో బాలికను వ్యక్తికి అప్పగించిన ఘటనలో పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సాధారణంగా వివాహం చేసుకున్న వారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పుడు పోలీసులు తప్పనిసరిగా ఇరువురి సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. మరి ఇక్కడ మైనర్‌ను వివాహం చేసుకున్న వ్యక్తి రక్షణ కోసం పోలీస్‌స్టేషన్‌కు రాగానే.. బాలిక అని నిర్ధారించడానికి ధ్రువీకరణపత్రాలు పరిశీలించలేదు. తల్లిదండ్రులు కూడా బాలిక అని చెప్పినా, బాలిక పుట్టినప్పుడు ఆస్పత్రి డిశ్చార్జి కార్డులు చూపించినా పోలీసులు పరిగణనలోకి తీసుకోలేదు. బాలిక అనే విషయంలో అనుమానం ఉన్నప్పుడు వెంటనే సుమోటోగా కేసు నమోదు చేయాలి. లేదంటే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి సమాచారం ఇవ్వాలి. మహిళా సిబ్బందితో బాలికను సఖి కేంద్రానికి తరలించాలి. కానీ, ఇవేమి చేయకుండా పెళ్లి చేసుకున్న వ్యక్తితో మైనర్‌ను పంపించడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సమాచారం అందుకున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ధారణలో మైనర్ అని తెలిసింది. అయినా బాధ్యుడిపై కేసు నమోదు చేయలేదు. దీని వెనుక మతలబు ఏమిటి..? మంగళవారం రాత్రి 11 గంటల వరకు బాలికను సఖి కేంద్రానికి తరలించి సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారా, అసలు వెనుక జరిగిన చర్చలు ఏమిటి, సదరు వ్యక్తికి బాలికను అప్పగించిన తర్వాత ఏం జరిగింది, అకస్మాత్తుగా ఓ పెద్ద మనిషి ద్వారా రాయబారం నడిపారా అనే పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఈ ఘటనపై స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ), ఇంటెలిజెన్స్ బృందాలు రంగంలోకి దిగాయి. పూర్తిస్థాయి విచారణ తర్వాత అసలు నిజం తేలనుంది. ఈ విషయమై నెక్కొండ సీఐ హథీరాంను వివరణ కోరగా తల్లిదండ్రులు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదు. సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన పెద్ద మనిషి వద్దకు బాలికను పంపించి మంగళవారం సఖి కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

నర్సంపేట రూరల్: ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేటలోని మాదన్నపేట రోడ్డుకు చెందిన మిట్టపల్లి సాయిబాబా–సుజాత దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సాయిబాబా టైలర్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రశాంత్ (17) నర్సంపేట మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. తల్లి సుజాత అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, ప్రశాంత్ బుధవారం రాత్రి ఇంటి ఆవరణలో ఇనుప పైపునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టానికి తరలించారు. కాగా, విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. దీనిపై ఎస్సై చరణ్‌ను వివరణ కోరగా ప్రశాంత్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది వాస్తవమే. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ఐదు చోట్ల ఓట్ల లెక్కింపు!

ఉమ్మడి జిల్లాలో కేంద్రాలు ఖరారు

- ఏనుమాములలో 5 అసెంబ్లీ స్థానాలవి లెక్కింపు
- ములుగు, భూపాలపల్లి, మానుకోట జనగామ ఎక్కడివక్కడే
- డిసెంబర్ 3న కౌంటింగ్‌కు కసరత్తు

హన్మకొండ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో శాసనసభ ఎన్నికలను పటిష్టంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ప్రచార గడువు దగ్గర పడుతుండడంతో ఒక వైపు పోలింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం అంతే వేగంగా కౌంటింగ్ కోసం కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మొత్తం 12 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 30న పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3న జరగనుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలో మొత్తం ఐదు లెక్కింపు కేంద్రాలను గుర్తించారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటికే ఏర్పాట్లు మొదలు పెట్టారు. గతంలో వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డులోనే లెక్కింపు చేసిన అధికారులు ప్రసుత్తం జిల్లాల వారీగా విభజించారు. ఏనుమాముల మార్కెట్‌లో వరంగల్ పశ్చిమ, తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల (ఐదు) నియోజకవర్గాల ఓట్లు లెక్కించనున్నారు. అదేవిధంగా జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల ఓట్లు జనగామ జిల్లా పెంబర్తిలోని విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీలో చేపట్టనున్నారు. డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల ఓట్లు మహబూబాబాద్ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో, భూపాలపల్లివి అక్కడి వీసీఈఆర్ క్లబ్‌లో, ములుగు ఓట్లు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల మీటింగ్ హాల్‌లో లెక్కించాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా కేంద్రాలను గుర్తిస్తూ జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఆయా జిల్లాల జిల్లాల ఎన్నికల అధికారులు, ఆర్ఓలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు మొదలు..

ఐదు నియోజక వర్గాలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహించే హాల్స్‌లో 24గంటల పాటు కరెంట్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యవసరాల కోసం జనరేటర్లు అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూంలకు తరలించిన ఈవీఎంల వద్ద సాయుధ బలగాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా సీసీ కెమెరాలు తాగునీరు, లైటింగ్ బారికేడ్లు, టాయిలెట్స్ వంటి సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ కేంద్రాలో అవసరమైన బోర్డులు, రిజిస్టర్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకోసం అవసరమయ్యే బాక్సులు వంటివాటిని అధికారులు సిద్ధం చేశారు. కౌంటింగ్ టేబుల్స్, జాలీలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. వీటి పనులు మొదలు పెట్టారు. ఇప్పటికే హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య.. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల ఏజెంట్లతో కలిసి ఏనుమాముల గోదాంలో లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలు సందర్శించి పరిశీలించారు. ఈవీఎంల భద్రత, కౌంటింగ్ ఏర్పాట్ల గురించి వారికి వివరించారు. అదేవిధంగా త్వరలో కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పోటీ చేస్తున్న అభ్యర్థులు	కౌంటింగ్ కేంద్రం
జనగామ	277	19	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి, జనగామ
స్టేషన్ ఘన్‌పూర్	290	19	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి, జనగామ
పాలకుర్తి	294	15	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి, జనగామ
డోర్నకల్	256	14	సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, మహబూబాబాద్
మహబూబాబాద్	283	12	సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, మహబూబాబాద్
నర్సంపేట	283	16	గోడౌన్ నం 17/ఏ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
పరకాల	239	28	గోడౌన్ నం 4/సీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వరంగల్ పశ్చిమ	245	15	గోడౌన్ నం 4/డీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వరంగల్ తూర్పు	230	29	గోడౌన్ నం 17/బీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వర్ధన్నపేట	278	14	గోడౌన్ నం 17/సీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
భూపాలపల్లి	317	23	సీఈఆర్ క్లబ్, అంబేడ్కర్ స్టేడియం, భూపాలపల్లి
ములుగు	303	11	జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మీటింగ్ హాల్

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

నయీంనగర్: పోలింగ్ కేంద్రాల్లో పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రమేశ్ అధికారులకు సూచించారు. బుధవారం హనుమకొండ కిషన్‌పుర చైతన్య కళాశాలలో పీఓ, ఏపీఓ, ఓపీఓలకు ఇస్తున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధులపై శిక్షణ తరగతుల్ని పరిశీలించారు. శిక్షణకు హాజరైన పోలింగ్ అధికారులు అడిగిన సందేహాలకు రిటర్నింగ్ అధికారి సమాధానం ఇచ్చారు. అనంతరం సీడీసీలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటు విధానాన్ని నిర్వహించారు. ఈసెంటర్‌లో హనుమకొండ డీఈఓ అబ్దుల్‌హై వేలికి సిరా పూసి వరంగల్ పశ్చిమ అసెంబ్లీలో ఉన్న మొదటి పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నారు. ఫారం –12 ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. కార్యక్రమంలో కాజీపేట తహసీల్దార్ భావుసింగ్, పురపాలక డిప్యూటీ కమిషనర్, ఏఈఆర్ఓ రమేశ్, ప్రిసైడింగ్ ఆఫీసర్ కుమారస్వామి, ఓపీఓలు రవీందర్, మోహన్‌స్వామి, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.



బ్యాలెట్ ఓటు వినియోగించుకుంటున్న డీఈఓ

మూడు రోజుల్లో హోం ఓటింగ్ పూర్తి

- ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు
- పోలింగ్ సిబ్బందికి శిక్షణ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: శాసనసభ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితిన్ వ్యాస్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఈవీఎంల కమిషనింగ్, ఇంటి నుంచి ఓటు సేకరణ, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై ఆయన కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలోని 7,56,608 మంది ఓటర్లలో ఇప్పటి వరకు 90 శాతం మంది ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన వారికి కూడా త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. జిల్లాలో 94,588 ఓటరు గుర్తింపు కార్డులు ముద్రించగా.. ఇప్పటి వరకు 81,151 ఓటరు గుర్తింపు (ఎపిక్) కార్డులు పంపిణీ చేశామని వెల్లడించారు. అదనపు బూత్ స్థాయి అధికారులను ఏర్పాటు చేసి ఈ నెల 25వ తేదీలోగా మిగిలిన వారికి కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ర్యాండమైజేషన్ పూర్తి చేశామని, ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ త్వరగా చేస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటి నుంచి ఓటు సేకరణ ప్రారంభమైందని, మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, పకడ్బందీగా పోలింగ్ నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ రోజు విధులు నిర్వర్తించే సిబ్బందికి ఓటు హక్కు కల్పించేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో కౌంటింగ్ నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని నియమించి శిక్షణ ఇస్తున్నామని, పకడ్బందీగా కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచార నిమిత్తం రాజకీయ నాయకులు నిర్వహించే సమావేశాలకు అనుమతులు మంజూరు చేస్తున్నామని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ప్రావీణ్య వివరించారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను ఎన్నికల నిబంధనల మేరకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట రిటర్నింగ్ అధికారులు షేక్ రిజ్వాన్ బాషా, అశ్వినితానాజీ వాకడే, ఆర్డీఓ వాసుచంద్ర, ఎన్నికల పర్యవేక్షకులు, అధికారులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

6 నుంచి ఎంబీఏ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి దూరవిద్య ఎంబీఏ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఎక్స్ విద్యార్థులకు డిసెంబర్ 6 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. డిసెంబర్ 6, 12, 16, 21, 28, జనవరి 3, జనవరి 8న పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

డిగ్రీ పరీక్ష ఫీజులు చెల్లించాలి

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) విద్యార్థులు అపరాధ రుసుము లేకుండా పరీక్షల ఫీజులు డిసెంబర్ 4 వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 8వ తేదీ వరకు గడువు ఉందన్నారు. కాగా.. పరీక్షల ఫీజులను కళాశాలల యాజమాన్యాలు ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలన్నారు.

ప్రలోభాల పర్వం షురూ



- వరంగల్ తూర్పులో చోటామోటా నేతలకు హామీల జల్లు
- గెలుపుపై ధీమాతో కాంగ్రెస్, మొక్కుబడి ప్రచారం..!

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రచార వ్యూహం మారింది. ప్రలోభాల పర్వం మొదలైంది. ఆపరేషన్ ఆకర్ష్ వెర్షన్ అప్‌డేట్ అయ్యింది. చోటామోటా నేతలను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ఎనలేని పాట్లు పడుతున్నారు. హామీల వర్షం కురిపిస్తున్నారు. ఇదే మంచి అవకాశంగా భావించిన గల్లీ లీడర్లు సైతం కండువాలు మారుస్తున్నారు. పార్టీ నేతల చీత్కారాలకు గురై అసహనంతో ఉన్న నాయకులూ పార్టీ మారుతున్నారు. రాష్ట్రంలో ఏపార్టీ అధికారం చేపట్టినా.. స్థానికంగా ఎమ్మెల్యేను గెలిపించుకుంటే కాంట్రాక్టులు దక్కుతాయనే అభిప్రాయాలు జంప్‌జిలానీల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు తమ సొంత గూటికి కాంగ్రెస్‌లో చేరడంతో షాక్ తిన్న గులాబీ నేతలు అగ్రనేతల దృష్టికి తీసుకువెళ్లడంతో వారి హామీలతో జంపు జిలానీలను మళ్లీ తమ పార్టీలో తిరిగి చేర్చుకుంటున్నారు. అధికార పార్టీలో ఉన్న నేతలు కొంత మంది పోలింగ్‌కు ముందు బీజేపీ, కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు లోపాయికారీగా మాట్లాడి పెట్టుకున్నట్లు సమాచారం.

రోడ్‌షోలు.. సమావేశాలు

పోటీలో ఉన్న అభ్యర్థులు నేరుగా ఓటర్లను కలుసుకునేందుకు వీలు కాకపోవడంతో నియోజకవర్గ స్థాయి పార్టీల నేతలు రోడ్‌షోలు, సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కులసంఘాల నేతలను మచ్చిక చేసుకునేందుకు మంతనాలు జరుపుతున్నారు. అవసరం అనుకుంటే సంఘాల ముఖ్య నేతలను పార్టీ అభ్యర్థితో మాట్లాడిస్తున్నారు. కార్తీక మాసం వన భోజనాల పేరిట, ఆత్మీయ సమ్మేళనాల పేరిట కుల సంఘాల ఆధ్వర్యంలో భోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రూపులుగా విడిపోయి రాత్రి వేళల్లోనూ ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఆశలు కలిగిస్తూ ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు కోసం ప్రధాన పార్టీల నేతలు విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. డివిజన్ స్థాయి నేతలకు బాధ్యతలు అప్పగించడంతో వారంతా డివిజన్లు, బూత్‌ల వారీగా ఓటర్లను కలుసుకుని ఆయా పార్టీల అభ్యర్థులకు ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇలా ప్రచారానికి ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదలడం లేదు.

కాంగ్రెస్ మొక్కుబడి ప్రచారం..

తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రం గెలుపుపై అతి విశ్వాసంతో మొక్కుబడి ప్రచారాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మిగతా వారు బూత్‌ల వారీగా నిధులు అందిస్తుండడంతో వారు ఇంటింటా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఇంకా నాయకుల సమీకరణలోనే మునుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. కాంగ్రెస్‌కు జోష్ వచ్చిందనే ప్రచారం జరుగుతుండడంతో ఆ పార్టీకి చెందిన అభ్యర్థి ఇంకా మూటలు విప్పడం లేదన్న ఆరోపణలు సొంత పార్టీలోనే వినిపిస్తోంది.

పరాయిపాలనకు స్వస్తి పలకాలి


దేవరుప్పుల: ప్రచారంలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

- ప్రకృతి వనరులను కూల్చి.. పేదల పొట్టగొడుతున్నారు
- కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి అభ్యర్థి యశస్వినిరెడ్డి

దేవరుప్పుల : కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రం మాదిరిగా చైతన్యవంతులై నియోజకవర్గంలో పరాయిల పాలనకు పాలకుర్తి ప్రజలు స్వస్తి పలకాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి మున్పహాడ్, గొల్లపల్లి, కామారెడ్డిగూడెం, సీతారాంపురం, కడవెండి, చిప్పరాళ్లబండతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరు, మలివిడత ఉద్యమాల్లో అమరులైన దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ, కాసోజు శ్రీకాంతాచారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ తెచ్చుకున్నది మన వనరులు, ఉద్యోగాలు సాధించుకోవడానికి.. అయితే ఆచరణలో అలా జరగడం లేదు.. ప్రకృతి వనరులను కూల్చి ఉపాధి కల్పన పేరిట బడా కంపెనీల కోసం భూసేకరణ చేసి పేదల పొట్టగొట్టేందుకు పాలకులు యత్నిస్తున్నారని ఆరోపించారు. మున్పహాడ్ రైతుల పక్షాన కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. తనను ఆదరించి గెలిపిస్తే.. కామారెడ్డిగూడెంలో కాంగ్రెస్ హయాంలో శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన బడి, రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల మాదిరిగా మిగిలిన పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి నియోజకవర్గాన్ని 'హస్తగతం' చేసుకోవడానికి కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు ఎస్.ప్రవీణ్‌రావు, సీపీఐ జిల్లా నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, జీడీ ఎలయ్య, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, సురేష్‌బాబు, ఓడపల్లి రవీందర్, పారుపెల్లి శ్రీనివాస్, రెడ్డిరాజుల రమేష్, సోమనర్సాజీ, మహేందర్‌జీ, గ్రామ బాధ్యులు యాకన్న, వెంకన్న, రతన్‌జీ, రాంబాబు, యాకు పాల్గొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661


తొర్రూరు: ఝాన్సీరెడ్డిని కలిసిన గౌడ ప్రతినిధులు

విద్యావంతుల సంపూర్ణ మద్దతు హర్షణీయం

ప్రభుత్వ మార్పు కోరే దిశలో కాంగ్రెస్ పార్టీకి విద్యావంతుల సంపూర్ణ మద్దతు హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, పులిగిళ్ల వెంకన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక న్యాయవేదిక, యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు తోటకూరి పాండుకృష్ణ కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన పులిగిల్ల ఎల్లయ్య, జక్కుల సోమయ్య, రాసాల ఐలయ్య, ఆదర్శ రైతు రాసాల మల్లయ్య, తోటకూరి రవీందర్, వేల్పుల ఎల్లయ్య ఉన్నారు.

ఉన్నత విద్యావంతులను ఉపాధి కూలీలుగా మార్చారు: లక్ష్మీనారాయణనాయక్

ఉన్నత విద్యావంతులను సైతం ఉపాధి కూలీలుగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ విమర్శించారు. బుధవారం మండలంలోని ధరావత్‌తండా, ధర్మగడ్డలో నియోజకవర్గ పరిశీలకులు రాజేష్ రాథోడ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తండాబాట ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గతంలో పోల్చుకుంటే గిరిజనుల్లో అక్షరాస్యత పెరిగి చైతన్యవంతులయ్యారన్నారు. కార్యక్రమంలో యాదా నాయక్, ధరావత్ రవీందర్ నాయక్, నల్ల యాదగిరి, దేవ, బీకోజీ, కిషన్, కీమా, శ్రీను పాల్గొన్నారు.

ఎర్రబెల్లికి పరాభవం తప్పదు: ఝాన్సీరెడ్డి

కొడకండ్ల : మాటల మాంత్రికుడు దయాకర్‌రావుకు ఈ ఎన్నికల్లో ప్రజల చేతిలో పరాభవం తప్పదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. బుధవారం నర్సింగాపురం మాజీ సర్పంచ్ పనస రాందాస్ గౌడ్, వార్డు సభ్యుడు ముత్యం వెంకన్న, గుగ్రం లింగయ్య, సోమయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలకు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని, పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో దయాకర్‌రావును ఓడించి పర్వతగిరికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, రమేశ్, రంగయ్య, యాకన్న, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.


కొడకండ్ల: కాంగ్రెస్‌లో చేరిన వారితో ఝాన్సీరెడ్డి

మార్పు కోరుతున్న పాలకుర్తి ప్రజలు

పాలకుర్తిటౌన్ : పాలకుర్తి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని ముత్తారం, మల్లంపల్లి, పాలకుర్తితో పాటు పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం అధిక సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ముత్తారం, పాలకుర్తి మాజీ సర్పంచ్‌లు భూమ రంగయ్య, అంగడి అంజమ్మ, మల్లంపల్లి ఉప సర్పంచ్ తంగళపల్లి యాకయ్యతో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా ఝాన్సీరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకుర్తిలో కాంగ్రెస్ యశస్వినిరెడ్డికి ఆదరణ పెరిగిందని, ఊహించని రీతిలో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు చిలువేరు కృష్ణమూర్తి, బైరు భార్గవ్, అంజిరావు పాల్గొన్నారు.

యశస్వినిరెడ్డికి గౌడ కులస్తుల మద్దతు

తొర్రూరు : పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డికి స్థానిక గౌడ సామాజికవర్గ ప్రతినిధులు మద్దతు తెలిపారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో గౌడ ప్రతినిధులు జలగం రామ్మూర్తిగౌడ్, రమేష్‌గౌడ్, బొమ్మగాని నర్సయ్య, యాకయ్య, చీకటి శంకరయ్య, బండి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

NEW SCIENCE P.G. COLLEGE
(Affiliated to Kakatiya University, Warangal)
Near Adalath, Hunter Road, Hanamkonda, Warangal Dist.
Phone: 0870-2511310, 9247789886, 9701743520
SPOT ADMISSIONS - 2023
M.Sc. Maths, Physics, Microbiology, Zoology, Botany, Chemistry, Computer Science, Statistics, Food Science & Technology, MSW, M.Com, M.Com (CA), M.Com. (FA)
Eligibility: Qualified in CPGET-2023 (or) 50% aggregate marks in qualifying examination
REMINDER TO UNREPORTED CANDIDATES
The candidates who took admission in our college through CPGET, Counseling And not yet reported, should report on or before 24-11-2023 by 10.00 am. failing, which their admissions will be cancelled and filled up by other eligible candidates on 25-11-2023 at 12.00 noon through spot counseling at institution level.
Note: Spot Admissions made as per Rules & Regulations of Convenor CPGET-2023
Few Management Seats are Available in M.Sc. Maths, Physics, Zoology, Botany, Chemistry, Computer Science, Statistics, MSW, M.Com. M.Com (CA).
Date: 22-11-2023 Sd/- SECRETARY

'నల్లింకు పెన్ను' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో పాల్గొన్న వేణుగోపాల్, రమేశ్ తదితరులు

కేయూ క్యాంపస్ : సమాజ గమనంతో కవిత్వం ముడిపడి ఉండాలని వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఎమ్మెస్సీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగం విద్యార్థి సభావత్ హాథిరామ్ రచించిన 'నల్లింకు పెన్ను' అనే పుస్తకాన్ని బుధవారం కెమిస్ట్రీ సెమినార్ హాల్‌లో వీసీ ఆచార్య తాటికొండ రమేశ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కవిత్వం అక్షరాల భాష కాదు..పద చిత్రాల భాష అని ప్రతీ ఒక్కరు కూడా కవిత్వం రాయగలరన్నారు. డిజిటల్ యుగంలోనూ రచనలు చేయడం అభినందనీయమన్నారు. యువత నూతన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ మాట్లాడుతూ.. ధైర్యం, సాహసం, నిర్భయత్వం యువత బలాలు కావాలన్నారు. రచనల ద్వారా సమాజ రుగ్మతలను ఎత్తిచూపాలన్నారు. కంప్యూటర్ బంధం కాదని మానవ బంధం అవసరం అన్నారు. నల్లింకు పెన్ను పుస్తకంలో రచయిత సమాజాన్ని ప్రతిబింబించే విధంగా తన కవితా హృదయాన్ని ఆవిష్కరించారని తెలిపారు. సమాజాన్ని విస్మరించే పరిశోధన అర్థరహితమన్నారు. సైన్స్ సమాజానికి సన్నిహిత సంబంధం ఉందన్నారు. కార్యక్రమంలో కాళోజీ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి టి.నాగరాజు, అమృత్‌రాజు శోభ, రమేశ్, భూక్యా ప్రవీణ్, కెమిస్ట్రీ విభాగం అధిపతి ఆచార్య సవితాజ్యోత్స్న, కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవ రెడ్డి, రచయిత హాథిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

- కాపాడిన కానిస్టేబుల్
- హసన్‌పర్తి చెరువు వద్ద ఘటన

హసన్‌పర్తి: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహితను కానిస్టేబుల్ రక్షించాడు. ఈ ఘటన బుధవారం హసన్‌పర్తి పెద్ద చెరువు వద్ద చోటు చేసుకుంది. నగరంలోని నయీంనగర్ ప్రాంతానికి చెందిన ఓ వివాహిత ఆర్థిక కారణాలతో భర్తతో గొడవ పడి హసన్‌పర్తి పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. అయితే స్థానిక సీఐ గోపికి ఆ వివాహిత అనుమానాస్పదంగా సంచరిస్తుందనే సమాచారం అందింది. దీంతో సీఐ ఆదేశాల మేరకు కోర్టు కానిస్టేబుల్ రత్నాకర్ అక్కడికి చేరుకున్నారు. అప్పటికే వివాహిత చెరువులో దూకడానికి సిద్ధంకాగా కానిస్టేబుల్ రక్షించారు. వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించారు. అనంతరం వివాహితకు కౌన్సెలింగ్ నిర్వహించి భర్తకు అప్పగించారు. వివాహితను రక్షించిన కానిస్టేబుల్ రత్నాకర్, తక్షణమే స్పందించిన సీఐ గోపిని సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE
KUDA, GWMC అప్రూవ్డ్ రెసిడెన్షియల్ ప్లాట్లు చింతగట్టు క్యాంప్ వద్ద తక్కువ ధరలో అమ్మబడును. గజం: 15,000/- మాత్రమే. సంప్ర॥ షాబుద్దీన్ 9618892127. [W-1229315]

నేడు అతి చిన్న పెట్టుబడి - రేపు అధిక రాబడి 121 చ॥గజాల ప్లాటు రూ॥ 2 లక్షలకే యాదాద్రి దగ్గరలో @ ఆలేరు. సెక్యూరిటీ * ఫెన్సింగ్ * గేటు Cont: 8008091512 [HA-10983]

HOUSE FOR SALE
వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-788954]

SERVICES
షూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital PH: 9041114468 [W-788952]

BUSINESS OFFER
నో రిస్క్ మీ పెట్టుబడికి 10% ఆదాయం ప్రతిరోజు పొందండి (డైలీ సేల్స్ ప్రొడక్ట్) వెజ్ - నాన్ వెజ్ పచ్చళ్ళు & కిరాణా ప్రొడక్ట్ వ్యాపారం కొరకు 2 లక్షలు ఇన్వెస్ట్ చేయువారు సంప్రదించండి. ల్యాండ్ పేపర్లు సెక్యూరిటీ ఇవ్వబడును. 8143909459. [W-788955]

FINANCE SERVICES
సిరి అసోసియేట్స్: అన్ని రకాల రుణాలు, పర్సనల్, హౌసింగ్, మార్టిగేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై కూడా సివిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: 9666142226. [W-1200958]

OLD AGE HOME
ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664/ 8977639665 [H-793653]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED
Wanted (Famale Candidate) Receptionist / Counsellor Qualification: Any Degree, PGDCA Good Salary. Ph: 8019752576. [W-788956]

కాంట్రాక్టర్ వద్ద పెట్రోల్ పంపు కన్‌స్ట్రక్షన్ & రైల్వే కన్‌స్ట్రక్షన్ నందు పనిచేయుటకు అనుభవం గల ఇంజనీర్స్ మరియు సూపర్‌వైజర్స్ కావలెను. వర్క్ ప్లేస్, తెలంగాణ సంప్ర॥ 9989608333, 9491474143. [W-1200962]

Govt (Regd) సంస్థ తరపున Work చేయుటకు సొంత కంప్యూటర్ గలవారు కావలెను. ఇంటి దగ్గరే వర్క్ చేస్తూ 9 to 19K వరకు సంపాదించే అవకాశం. సెల్: 8977429273. [W-1229312]

హన్మకొండ, వరంగల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥, 12 గం॥ కలవు. జీతం: 12000/- 16000/-. సెల్: 8688072125. [W-1220871]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221873]

WANTED TEACHERS
Wanted Lady Teachers to teach 1st to 5th Classes. Maths and English Fluent in English and Experienced are Preferred. Contact: 9963006221. [W-788951]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అత్తా, కోడళ్ల మాటలు నమ్మొద్దు..


పెద్దవంగర: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు


కొడకండ్ల ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న దయాకర్‌రావు

- కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మోసపోతరు
- బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర: అబద్ధాలు ప్రచారం చేసే అత్తా, కోడళ్లను నమ్మొద్దు.. వారు చెప్పే మాటలు విని కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోతరని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధి చిన్నవంగర, చిట్యాల, బొమ్మకల్లుతోపాటు మండల కేంద్రంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మహిళలు మంత్రికి నుదుట తిలకం దిద్ది బతుకమ్మలు, కోలాటాలు, డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. రేలారే రేలా ఫేం గంగా, జానపద గాయని కనకవ్వ, జబర్దస్త్ ఫేం రాజమౌళి ఆటపాటలతో ప్రజలను ఆకర్షించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. మీతో నిత్యం ఉంటూ మీ కష్టాల్లో పాలుపంచుకున్న తనను నమ్ముతారా.. ఇప్పుడు వచ్చి ఒక్క చాన్స్ ఇవ్వండని ప్రజల కాళ్లా, వేళ్లా పడుతున్న అత్తా, కోడళ్ల(ఝాన్సిరెడ్డి, యశస్వినిరెడ్డి)ను నమ్ముతారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నాడు కాంగ్రెస్‌కు పది అవకాశాలు ఇస్తే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఆ పార్టీకి ఓటేస్తే కరెంటు కోసం గోసపడిన రోజులు మళ్లీ వస్తాయని, ప్రజలు ఒక్కసారి పరిశీలన చేసుకోవాలని చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాను.. కరోనా కష్ట కాలంలో ఆనందయ్య మందును పార్టీలతో సంబంధం లేకుండా నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి కాపాడుకున్నానని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ సుధాకర్‌రావు, ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జ్యోతిర్మయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, నాయకులు రామచంద్రయ్య శర్మ, కేతిరెడ్డి దీపిక సోమనర్సింహారెడ్డి, జలగం శేఖర్, సర్పంచ్‌లు, రావుల శ్రీనివాస్ రెడ్డి, జలగం లక్ష్మీ, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను వదులుకోవద్దు : మంత్రి సత్యవతి

తొర్రూరు రూరల్: యాభై ఏళ్లుగా గ్రామాలతో సంబంధం లేకుండా వివక్షకు గురైన తండాలను గుర్తించి గ్రామ పంచాయతీలుగా చేసిన సీఎం కేసీఆర్‌ను వదులుకోవద్దని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. వెలికట్ట గ్రామ శివారులో నిర్వహించిన గిరిజన ఆత్మీయ ఆశీర్వాద సభలో ఆమె మాట్లాడారు. 'మన రాజ్యంలో మన పాలన'కు నాంది పలికి గిరిజనుల ఆత్మ గౌరవాన్ని పెంచిన ప్రభుత్వం.. సేవాలాల్, తీజ్ పండుగలను అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్న సీఎం కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో 60వేల భారీ మెజార్టీతో గెలుస్తానని, గతంలో మీ దీవెనలతో గెలిచి, కేసీఆర్ ఆశీర్వాదంతో మంత్రిగా తండాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేశానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగాలంటే మరోసారి ఆదరించాలని కోరారు. అనంతరం ర్యాలీలో గిరిజనులతో నృత్యాలు చేస్తూ ఎర్రబెల్లి సందడి చేశారు..


తొర్రూరు : గిరిజన ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

రెడ్డి సోదరులకు అండగా ఉంటా..

తొర్రూరు రూరల్: నియోజకవర్గంలోని రెడ్డి సోదరుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. నాంచారీమడూరు శివారు రెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రెడ్డి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కువ మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తారని, అందులో రెడ్డి కులానికి చెందిన వారే ఎక్కువగా ఉంటారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు అవసరమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటి కొనసాగింపునకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటవరప్రసాద్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, చిత్తరంజన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలోచించి వేటు వేయాలి..

కొడకండ్ల: మూడు గంటల కరెంట్ కావాలో.. సీఎం కేసీఆర్ సారథ్యంలో నిరంతర కరెంట్ కావాలో ఆలోచించి ఓటు వేయాలని పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని లక్ష్మక్కపల్లి, రామన్నగూడెం, కొడకండ్ల గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


పాలకుర్తి : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎర్రబెల్లి ఉషాదేవి

దయాకర్‌రావు గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

పాలకుర్తి: రాష్ట్రంలో ప్రజలకు సేవలు అందించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపే అంతిమ లక్ష్యంగా కృషి చేయాలని ఆయన సతీమణి, ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదేవి అన్నారు. బుధవారం పాలకుర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇదిలా ఉండగా. మండలంలోని పలు గ్రామాల్లో దివ్యాంగులు ప్రచారం నిర్వహించారు. ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన దయాకర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దివ్యాంగుల సేవా సమితి నాయకులు పాల్గొన్నారు.

సేవలను చూసి గెలిపించాలి

రాయపర్తి: నియోజకవర్గానికి చేసిన సేవలను, అభివృద్ధిని చూసి ఎర్రబెల్లి దయాకర్‌రావును గెలిపించాలని బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు పిలుపునిచ్చారు. కాట్రపల్లిలో కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించిన ఆయన కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పార్టీ మండల ప్రధానకార్యదర్శి పూస మధు, సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, మండల శ్రీధర్, అన్వర్, ముద్రబోయిన శ్రీనివాస్, కత్తి సోమన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో గిరిజనుల చేరిక

దేవరుప్పుల: దేవరుప్పుల మండల పడమటితండా, లకావత్‌తండా, తూర్పుతండా(ఎం), కొడకండ్ల మండలం మైదంచెరువు, రాయపర్తి తండాలకు చెందిన గిరిజన యువత కాంగ్రెస్‌ను వీడి పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రామ్‌సింగ్, చింత సోమయ్య, ఎంపీటీసీ యాకూనాయక్‌పాల్గొన్నారు.

ఐఈఎస్‌లో అభిషేక్‌కు 42వ ర్యాంకు


వేముగంటి అభిషేక్

స్టేషన్‌ఘన్‌పూర్ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఐఈఎస్(ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్)లో మండలంలోని శివునిపల్లికి చెందిన వేముగంటి రాంప్రసాద్, శ్రీదేవిల కుమారుడు అభిషేక్ ఆల్ ఇండియా 42వ ర్యాంకు సాధించాడు. ఐఈఎస్ ఫైనల్ రిజల్ట్స్ బుధవారం వెలువడ్డాయి. అభిషేక్ పదో తరగతి వరకు స్థానిక సెయింట్ థామస్ హైస్కూల్‌లో, ఇంటర్ హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో, బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ నాగపూర్‌లోని నిట్‌లో చదివాడు. కాగా, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభిషేక్‌కు అభినందలు తెలిపారు.

సంతోషంగా ఉంది: అభిషేక్

ఐఈఎస్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు(42వ) రావడం చాలా సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి నన్ను చదివించారు. తమ్ముడు, స్నేహితుల ప్రోత్సాహంతో కష్టపడి చదివా. సమాజంలో ఉత్తమ ఉద్యోగిగా సేవలు అందిస్తా.

వరంగల్ మార్కెట్‌కు పది రోజులు సెలవు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 25 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు సెలవు ఉంటుందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న వారాంతపు యార్డు బంద్, 26 ఆదివారం, 27న కార్తీక పౌర్ణమి, గురునానక్ జయంతి సెలవు, 28వ తేదీ నుంచి 4వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు యార్డులు బంద్ ఉంటాయని పేర్కొన్నారు. ఈ పది రోజులు మార్కెట్‌లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవన్నారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు గమనించాలని కోరారు.

ఓటు భద్రంగానే..!

- అక్రమాన్ని అడ్డుకునేందుకు 'చాలెంజ్ ఓటు'
- ఓటు గల్లంతైతే 'టెండర్ ఓటు' కు అవకాశం
- ఎన్నికల కమిషన్ వెసులుబాటు



వర్ధన్నపేట: సాధారణంగా వివిధ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటర్ స్లిప్, గుర్తింపు కార్డు చూపి ఓటు వేయడమే మనకు తెలుసు. కానీ ఓటు వేయంలోనూ చాలెంజ్, టెండర్ అనే రెండు రకాల ఓట్లు ఉంటాయి. అవేంటో ఒకసారి చూద్దాం..

చాలెంజ్ ఓటు

పోలింగ్ కేంద్రంలో అధికారులతో పాటు ఆయా పార్టీలు నియమించుకున్న పోలింగ్ ఏజెంట్లు ఉంటారు. ఒక ఓటరు వచ్చినప్పుడు సదరు ఓటరు నకిలీ అని ఏజెంట్ సందేహించినప్పుడు పోలింగ్ ఏజెంట్ చాలెంజ్ చేయడానికి వీలు కల్పించారు. ఓటరు సరైన వ్యక్తి కాదని ప్రిసైడింగ్ అధికారితో చాలెంజ్ చేసి రూ.5 రుసుం చెల్లించి చాలెంజ్ చేస్తాడు. దీంతో ప్రిసైడింగ్ అధికారి ఓటరుకు సంబంధించిన పత్రాలు అన్ని పరిశీలించి నిర్ధారణ చేసుకుని సరైన ఓటరుగా నిరూపణ అయితేనే ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తారు. లేదంటే వెనక్కి పంపిస్తారు. కొన్ని సందర్భాల్లో ఓటరుకు బ్యాలెట్ అందించి దాని ద్వారా ఓటు వేయించి కవర్‌లో ఉంచి సీల్ చేస్తారు. ఓటరు సక్రమని తేలితే కౌంటింగ్ సమయంలో కవర్ ఓపెన్ చేసి దానిని లెక్కిస్తారు.

టెండర్ ఓటు..

పోలింగ్ రోజున తన ఓటు ఎవరో వేశారని ఓటరు గుర్తించిన పక్షంలో టెండర్ ఓటు వేస్తానని అధికారులను కోరవచ్చు. తన స్థానంలో ఇంకెవరో ఓటు వేశారని ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి. అప్పుడు ఆ అధికారి విచారణ జరిపి గుర్తింపు నిర్ధారిస్తారు. అయినా ఓటు వేయడానికి అవకాశం కల్పించకుంటే టెండర్ ఓటు వేస్తానని ఓటరు డిమాండ్ చేయొచ్చు. రూ. 2 రుసుం చెల్లించి టెండర్ ఓటు సైతం బ్యాలెట్ ద్వారానే వేసుకోవాల్సి ఉంటుంది. ఓటరు వేసిన టెండర్ ఓటును సీల్డ్ కవర్‌లో భద్రపరుస్తారు. ఇలా ఎన్నికల కమిషన్.. ఓటరు చాలెంజ్, టెండర్ ఓట్లు వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది.

సమ్మెకు రైల్వే కార్మికులు సై

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ పరిధిలో వివిధ రైల్వే కార్యాలయాల్లో సోమ, మంగళవారాల్లో రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె బ్యాలెట్‌లో కార్మికులంతా సమ్మె చేయాలని ఓటింగ్‌లో ద్వారా తీర్పు ఇచ్చారని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సీడబ్ల్యూసీ మెంబర్ చింత మురళి బుధవారం తెలిపారు. సమ్మె బ్యాలెట్‌లో కాజీపేట డీజిల్ లోకో షెడ్‌లో 525, ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో 370, లోకో రన్నింగ్ కార్యాలయంలో 428, హెడ్ క్వార్టర్స్‌లో 376, ఇంజనీరింగ్ విభాగంలో 370, క్యారియజ్ అండ్ వ్యాగన్, సిగ్నల్ అండ్ టెలి కమ్యూనికేషన్ ఎలక్ట్రిక్, మెడికల్ విభాగంలో 181 మంది రైల్వే కార్మికులు పాత పెన్షన్ విధానమే కావాలని కోరుతూ సమ్మె కావాలని మొత్తం 2,250 మంది కార్మికులు మద్దతు ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

మజ్దూర్ యూనియన్ సమ్మె బ్యాలెట్ ముగింపు

కాజీపేట రైల్వే స్టేషన్‌లో, రైల్వే డ్రైవర్ల కార్యాలయం, డీజిల్ లోకో షెడ్, ఎలక్ట్రిక్ లోకోషెడ్, ఘన్‌పూర్ స్టేషన్, కాజీపేట సెంట్రల్ కార్యాలయం, టీటీ మిషన్ కార్యాలయంలో మంగళ, బుధవారం రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మె బ్యాలెట్‌లో దాదాపు రైల్వే కార్మికులందరు పాత పెన్షన్ విధానమే కావాలని ఓటింగ్ తీర్పు ద్వారా తెలిపారని రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ చైర్మన్ పాక వేదప్రకాష్ తెలిపారు.

కాకతీయుల చరిత్ర తెలుసుకోవాలి

- అసిస్టెంట్ ప్రొఫెసర్ రామిరెడ్డి, కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం


పోటీలకు హాజరైన విద్యార్థులు, ప్రొఫెసర్ రామిరెడ్డి, జిల్లా అధికారి మల్లేశం

ఖిలా వరంగల్: విద్యార్థి దశ నుంచే చారిత్రక కట్టాడాలను పరిరక్షిస్తూ, కాకతీయుల చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. రామిరెడ్డి, కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మడిపల్లి మల్లేశం అన్నారు. పురావస్తుశాఖ ఆదీక్షకురాలు స్మిత ఎస్ కుమారీ ఆదేశాల మేరకు ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా బుధవారం చారిత్రక ఖిలా వరంగల్ మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో పలు పాఠశాలల విద్యార్థులకు కాకతీయుల విశిష్టత, ప్రజా రంజకపాలనపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పూర్వీకులు మనకు అందజేసిన విలువైన శిల్ప కళా సంపదను కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు జరిగాయి. కార్యక్రమంలో శ్రీకాంత్, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టి కొప్పుల అజయ్, పలు ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.